# ఎన్నికల ప్రక్రియకు సహకరించాలి

- కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు అందించాలి
- ర్యాలీలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి
- విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు
- ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి

ములుగు టౌన్, అక్టోబర్ 12 : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుగు జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని, కోడ్ ఉల్లంఘనలపై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీ–విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 24 గంటలు నమోదు చేయవచ్చని తెలిపారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేసినా, తప్పుడు ప్రచారాలకు పాల్పడినా ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం అభ్యర్థులపై ఆరేళ్ల నిషేధం ఉంటుందన్నారు. అక్టోబర్ 31 వరకు నూతన ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, జాబితాలో పేర్లు లేకుండా ఎవరైనా అర్హులైన ఓటర్లుంటే వెంటనే సమర్పించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీల నిర్వహణ కోసం ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని ఇలా త్రిపాఠి సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డీఎస్ వెంకన్న, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, అనిస్ ఫాతిమా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాం తనిఖీ

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంను గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. రాజకీయ ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ తీసి ఈవీఎం లు, వీవీ ప్యాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గోదాం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీ వో అంకిత్, అదనపు కలెక్టర్ వెంకన్న, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులున్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

## అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 12 : అసాంఘిక శక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై రేఖ అశోక్ అన్నారు. గురువారం మండలంలోని కొండాపురం జీపీ పరిధిలోని బస్తరుగుంపు గ్రామంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా గ్రామంలో సంచరిస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటాచారి

## బిల్ట్ కార్మికులకు వేతన సెటిల్మెంట్ చేయాలి

మంగపేట, అక్టోబర్ 12 : బిల్ట్ కార్మికులకు వేతన సెటిల్మెంట్ చేయాలని ఏపీ ఆదర్శ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే వెంకటాచారి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ బిల్ట్ కంపెనీని పిన్ క్వాస్ట్ సంస్థ నుంచి ఐటీసీ సంస్థ తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయని, త్వరలోనే వారు స్వాధీనం చేసుకుంటారని తెలిసిందన్నారు. అయితే కార్మికులకు వేతన సెటిల్‌మెంట్ చేయకుండా కంపెనీలో ఎలాంటి పనులు మొదలు పెట్టినా కార్మికులు అడ్డుకుంటారన్నారు. పిన్ క్వెస్ట్ సంస్థ, ఐటీసీ కంపెనీ తమ సమస్యలను సహృదయంతో అర్థం చేసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జీ విజయారావు, ఎన్ రాజయ్య, పాషా, మార్కండేయ, రాము లు, జీవీ కృష్ణ, కృష్ణ, సీహెచ్ రమేశ్, ఎడ్డన్న, రవీందర్ పాల్గొన్నారు.

## గిర్దావర్‌కు సన్మానం

వాజేడు, అక్టోబర్ 12 : తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ కిరణ్ గిర్దావర్‌గా ఉద్యోగోన్నతి పొంది వెంకటాపూర్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను గురువారం తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాహుల్‌చంద్రవర్మ, గిర్దావర్ కీసరి రాజు, సిబ్బంది బాలకృష్ణ, అనూష, ఉదయ, రాము తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 12 : మండలంలోని అలుబాక హెల్త్ సబ్ సెంటర్లో కాఫేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 60 మంది గర్భిణులకు పోషకాహార కిట్లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూజరి ఆదిలక్ష్మి, సర్పంచ్ రాధ, కాఫేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ లూరురాజు, మండల కోఆర్డినేటర్ గొండ నుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## వాజేడు ఏపీఎంగా లక్ష్మీదుర్గ

వాజేడు, అక్టోబర్ 12 : మండల ఏపీఎంగా అన్నపురెడ్డి లక్ష్మీదుర్గ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు తాడ్వాయికి, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీదుర్గ వాజేడుకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన ఏపీఎం వెలుగు సీసీలు, అకౌంటెంట్‌తో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మల్లాచారి, పొడపాటి సత్యనారాయణ, శంకరమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి పంటలు పరిశీలించిన అధికారులు

మంగపేట, అక్టోబర్ 12 : మండలంలోని కొత్తగూడెం, రాపేట గ్రామాల్లోని మిర్చి పంటలను గురువారం మండల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించారు. మిర్చిలో కుచ్చు తెగులు, పైముడత, కింద ముడతను అధికారులు గుర్తించారు. నివారణకు ఎకరానికి 10 పసుపు జిగురు అట్టలు, నీటి జిగురు అట్టలు అమర్చాలని రైతులకు సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఒక లీటర్ నీటికి 3 మిల్లీలీటర్ల వేప నూనెతో పాటు 0.2 గ్రాముల ఫిప్రొనిల్ లేదా 0.4 గ్రాముల తియోమితోక్సామ్ లేదా 1.25 గ్రాముల డైఫెంతురాన్ వారం రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు మందులు మార్చి స్ప్రే చేయాలని సూచించారు. పంటలను పరిశీలించిన వారిలో ఏవో చేరాలు, ఉద్యాన అధికారి వేణుమాధవ్, సొసైటీ చైర్మన్ రమేశ్, రైతులు పాల్గొన్నారు.

## అగ్గి తెగులుపై ఆందోళ న చెందొద్దు

గోవిందరావుపేట : ప్రస్తుతం వరి పైరులో అగ్గి తెగులు, మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందొద్దని, ముందస్తుగానే మందులు పిచికారీ చేసుకోవాలని వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు నాగభూషణం, శ్రావణ్, పద్మజ, శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని చల్వాయి, మచ్చాపూర్ గ్రామాల్లోని వరి పొలాలను వారు గురువారం పరిశీలించారు. అగ్గి తెగులు నివారణకు ఎకరానికి ఐషో ప్రొటీయలిన్ 300 ఎంఎల్ లేదా కాసుబామైసిన్ 500 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. అలాగే మచ్చ తెగులు నివారణకు పైరో మైసోథెల్ 200 ఎంఎల్, ప్రొటినోకోజల్ 200 ఎంఎల్ మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు గోపాల్‌రెడ్డి, దాదాసింగ్, రైతులు పాల్గొన్నారు.


గోవిందరావుపేట : వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

## ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యానికి పాల్పడితే కఠిన చర్యలు

- మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎస్పీ గౌష్ ఆలం

ములుగు టౌన్, అక్టోబర్ 12 : ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో మహిళలపై వేధింపుల నివారణకు ప్రతి శాఖలోనూ ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని, పోలీస్ శాఖ తరపున షీ టీమ్ కీలకంగా పనిచేస్తున్నదని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్ వెంకన్న, డీఎంహెచ్‌వో అప్పయ్య, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీవీహెచ్‌వో వి జయభాస్కర్, డీఈవో పాణిని, ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబర్స్ పత్తిపల్లి మహేశ్ నాయక్, సుకుమార్, చుంచు రవి, నక్క భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీడీ పోచం

ఏటూరునాగారం, అక్టోబర్ 12 : క్రీడాకారులు స్నేహభావంతో మెలుగుతూ ఆటల్లో తమ ప్రతిభను చూపించాలని ఐటీడీఏ డీడీ పోచం అన్నారు. గురువారం డివిజన్‌స్థాయి ఎంపిక క్రీడోత్సవాలను మండలంలోని చిన్న బోయినపల్లి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా పోచం హాజరై ప్రారంభించారు. ఐటీడీఏ పరిధిలోని 8 పాఠశాలలకు చెందిన 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో ఖో–ఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంవో కోడి రవీందర్, డివిజన్ స్థాయి క్రీడల కన్వీనర్, పీజీహెచ్‌ఎం వాసం సారంగపాణి, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు

ములుగు రూరల్, అక్టోబర్ 12 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, జగ్గన్నపేటలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయినులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి దసరా సెలవులు కావడంతో గురువారం చివరి రోజున విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల లు, కళాశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది.

### వాజేడులో..

వాజేడు : మండలంలోని మొరుమురు జీపీలోని ఎంపీపీఎస్ ప్రగళ్లపల్లి, మొరుమురుకాలనీ తదితర పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలు పేర్చిన అనంతరం పాఠశాలలో ఆడుకొని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కొట్టెం సునీత, వాసం సుదేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


వాజేడు : బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న విద్యార్థినులు


వెంకటాపురం (నూగూరు) : బతకమ్మలతో విద్యార్థినులు

### వెంకటాపురం (నూగూరు)లో..

వెంకటాపురం (నూగూరు) : మండలంలోని పలు విద్యాలయాల్లో గురువారం ముందస్తు బతకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి పాటలు పాడుతూ ఆడుకున్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.